ప్రజాశక్తి

గురువారం 3 ఆగస్టు 2023



పిల్ల కాలువకు గండి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రానికి సమీపంలో బోడిమెట్ట వద్ద ఉన్న ఐదో బ్రాంచ్ పిల్ల కాలువకు బుధవారం గండి పడింది. దీంతో కిందకి వెళ్లాల్సిన సాగు నీరంతా పంట పొలాల్లోకి చేరుతోంది. పంట పొలాలు నీటితో మునిగి దర్శనమిస్తున్నాయి. కొద్దిరోజులు కిందట ఇదే ప్రాంతంలో కాలువకు గండి పడడంతో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి పూడ్చివేశారు. పది మీటర్ల దూరంలో మళ్లీ కాలువకు గండిపడడంతో సాగునీటి కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కాలువ గట్లు బలహీనంగా ఉండటం వల్ల నీటి ప్రవాహం ఒక్కసారిగా రావడంతో ప్రతిసారి ఇదే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు.



గండిపడటంతో కిందికి వెళ్లిపోతున్న నీరు



జ్వరంతో బాధపడుతున్న హాస్టల్ విద్యార్థులు

మన్యంలో మరణ మృదంగం

వారంలో ఇద్దరు గిరిజన బాలలు మృతి • ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

వర్షాకాలం వచ్చిందంటే మన్యంలో ఆందోళనే. గిరిజన ప్రాంతంలో చిన్నారులు, విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం అపారిశుధ్య వాతావరణం, కలుషిత నీరు, దోమకాటు. దీంతో చిన్నారులు, విద్యార్థులు, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, ఇతర వ్యాధుల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. సకాలంలో సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. కానీ ఐటిడిఎ అధికారులు మాత్రం మరణాల నివారణకు పూర్తిస్థాయి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రతి ఏటా వర్షాకాలంలో గిరిజన బాలల మరణాలు ఏదో ఒకచోట సంభవిస్తూనే ఉన్నాయి.

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం నాలుగు నెలల పాటు గిరిజన గ్రామాల్లో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అనారోగ్యంతో బాధపడుతూ రోగులు నిత్యం వైద్యం కోసం వస్తుంటారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలోనే పార్వతీపురం మన్యం జిల్లాలో ఇద్దరు గిరిజన బాలలు జ్వరాలతో బాధపడుతూ మృతిచెందడం కలవరపెడుతోంది. సీతంపేట మండలం పెద్దపల్లంకివలసకు చెందిన బిడ్డిక కార్తికేయ (7) మలేరియా బారిన పడి మృత్యువాత పడ్డాడు. మక్కువ మండలం ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బిడ్డిక మహేంద్ర జ్వరంతో బాధపడుతూ మరణించాడు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు గిరిజన బాలలు మరణించడంతో వారింట విషాదం నెలకొంది.

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న 55 ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, సీతంపేట ఐటిడిఎ పరిధిలో 43 ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు ఏదో ఒక అనారోగ్యం కారణంతో సమీపంలోనే దవాఖానాలకు వైద్యం కోసం వెళుతున్నారు. ఆసుపత్రుల్లో రోజువారీ ఒపి 150 పైనే ఉంటుంది. అందులో 30 మంది వరకు విద్యార్థులే ఉండటం విశేషం. దీనిని బట్టి చూస్తే జ్వరాల తీవ్రత ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. వైద్యం కోసం వస్తున్న విద్యార్థులు జ్వరాలతో ఆసుపత్రిలో చేరుతున్నారు. ఒక్కొక్కసారి రోగుల తాకిడితో మంచాలు చాలక ఒకే మంచంపై ఇద్దరు ముగ్గురు ఉండాల్సిన పరిస్థితి.

హెల్త్ వర్కర్లు లేక సేవలు కరువు

ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న హెల్త్‌వర్కర్లను ప్రభుత్వం తొలగించడంతో విద్యార్థులకు స్థానికంగా సేవలు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వస్తున్నారు. పాఠశాల సమయంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రులకు రావడంతో తరగతులకు దూరం కావాల్సి వస్తోంది. మరోవైపు విద్యార్థులకు కండ్ల కలకలు రావడంతో అటు వైద్యం అందక, ఇటు చదువు లేక చివరికి ఇంటి బాట పట్టాల్సిన పరిస్థితి వస్తోంది.

వారం వారం వైద్య పరీక్షలు తప్పనిసరి

ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు వారం వారం అధికారులు ఆరోగ్య పరీక్షలు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాలా మంది విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం కారణంగా రక్తహీనత కనిపిస్తోంది. దీనికితోడు జ్వరం, కడుపు నొప్పి కారణంగా విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఆశ్రమ పాఠశాలలో పౌష్టికాహారం విద్యార్థులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ఐటిడిఎ అధికారులపై ఉంది. అయితే వసతిగృహాలపై పర్యవేక్షణ లోపం పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైద్య శిబిరాలు నిర్వహించాలి



మన్యం జిల్లాలో గిరిజన గ్రామాలు, ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య సేవలు అందించాలి. మందులు పంపిణీ చేయాలి. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వర్కర్ పోస్టులను భర్తీ చేయాలి.

– కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

మక్కువ : జ్వరంతో మరణించిన విద్యార్థి మహేంద్ర కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న శాశ్వత ఎఎన్ఎం పోస్టు వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బిడ్డిక మహేంద్ర సరైన వైద్యం అందక పోవడం వల్లే మరణించాడని అభిప్రాయపడ్డారు. పోషకాహారం అందించకపోవడం వల్ల విద్యార్థులు ఇక్కడ తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టి.ప్రవీణ్, కె.వెంకటస్వామి పాల్గొన్నారు.




గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ వెంకటరమణ

డిప్యూటీ డిఎంహెచ్ఒ పరామర్శ

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని నంద గిరిజన గ్రామాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ వెంకటరమణ బుధవారం సందర్శించారు. మంగళవారం మృతి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థి మహేంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో జ్వరాల పరిస్థితిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో శంబర పిహెచ్‌సి వైద్యాధికారి రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గైర్హాజరైన అధికారులపై చర్యలు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-పాచిపెంట


గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర.. ఎంపిడిఒ జి.పార్వతికి సిఫార్సు చేశారు. పాచిపెంట మండల కేంద్రంలో మూడో రోజు బుధవారం కొనసాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఉదయం తొమ్మిది గంటలకు డిప్యూటీ సిఎం హాజరయ్యారు. 10 గంటల వరకు ఈ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఒకరోజు వేతనం నిలిపివేయాలని ఎంపిడిఒను ఆదేశంచారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏయే సంక్షేమ పథకాల ద్వారా ఎంత మొత్తంలో లబ్ధి చేకూరిందో లబ్ధిదారులకు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సిఎం లక్ష్యమని అన్నారు.

కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పథకాలు అందిస్తామని చెప్పారు. ఎవరూ అసంతృప్తి చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధానకార్యదర్శి డోల బాబ్జి, టి.గౌరీశ్వరరావు, వైస్ ఎంపిపి మీసాల నారాయణ, కె.పార్వతి, పి.శ్రీనివాసరావు, ఎం.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నను కలిసిన ఆశావహులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆశావహులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో టిడిపి పరిస్థితి, చేస్తున్న పార్టీ కార్యక్రమాలు, ప్రజలను వస్తున్న ఆదరణను వివరించారు. గతం కంటే టిడిపికి బలం పెరిగిందని, ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని వివరించారు. 2024 ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. అచ్చెన్నను కలిసిన వారిలో టిడిపి నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, బిడ్డిక పద్మావతి, పువ్వల లావణ్య, ఆర్ఎస్ఎస్ విజయ్ కుమార్, బిడ్డిక తమ్మయ్య, భూపతి దొర ఉన్నారు.



అచ్చెన్నాయుడుతో బిడ్డిక పద్మావతి

మణిపూర్ అల్లర్లకు బాధ్యత బిజెపిదే

నేటి మన్యం బంద్ విజయవంతం చేయాలి
ఆదివాసీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు

ప్రజాశక్తి-సాలూరు

మణిపూర్‌లో మారణ హోమానికి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానిదే బాధ్యతని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు చెప్పారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన నూతన అటవీ విధానంతో దేశంలో ఉన్న గిరిజన తెగలకు తీరని నష్టమన్నారు. గిరిజనుల అనుమతి లేకుండా కార్పొరేట్‌లకు అడవులను అప్పగించడానికి అవకాశం కల్పించే విధానాన్ని వ్యతిరేకిస్తూ గురువారం చేపట్టే మన్యం బంద్ విజయవంతం చేయాలని కోరారు.

మణిపూర్‌లో గడచిన మూడు నెలలుగా కుకీ, నాగా గిరిజన తెగలపై స్థానిక బిజెపి ప్రభుత్వం అండతో జరుగుతున్న హింసాకాండ దారుణమన్నారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగింపు మొదలుకొని ఎంతోమంది గిరిజనులను కిరాతకంగా హత్య చేసిన సంఘటనలు ఆ రాష్ట్రంలో జరిగాయని చెప్పారు. హింసాకాండకు బాధ్యుడిని చేస్తూ మణిపూర్ సిఎం బీరేంద్ర సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందరరావు, కార్యదర్శి గెమ్మెల జానకీరావు పాల్గొన్నారు.

కురుపాం : మన్యం బంద్‌కు సహకరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి పి.తిరుపతిరావు కోరారు. బుధవారం కురుపాంలో దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచుతూ బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.మోహనరావు, కె.సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



కురుపాం.. బంద్ విజయవంతానికి ప్రచారం చేస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పన కుమారి

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ ఆధ్వర్యంలో ఆదివాసీ, స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం ఐటిడిఎలోని అన్ని శాఖల అధికారులతో ఆదివాసీ, స్వాతంత్ర దినోత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తగ్గట్టుగా వేడుకలు నిర్వహించాలన్నారు. అడవితల్లి విగ్రహం వద్ద పూజలతో వేడుకలు ప్రారంభం అవుతాయని చెప్పారు. వేడుకకు హాజరయ్యే గిరిజనులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గిరిజన సంఘాల నాయకులందరినీ ఆహ్వానించాలని అన్నారు. సెల్ఫీ పాయింట్, జిసిసి స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్వాతంత్ర దినోత్సవానికి కూడా ఇదే విధంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎపిఒ రోసిరెడ్డి, ఇఇ సింహాచలం, జిసిసి డిఎం సంధ్యారాణి, డిడి శ్రీనివాసరావు, పిహెచ్ఒ గణేష్, తహశీల్దార్ నర్సింహమూర్తి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఢిల్లీశ్వరరావు, ఎస్ఐ నీలకంఠరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ చిరంజీవి, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం!

సంపూర్ణ వర్షాలు కురవక రైతులు సతమతం

ప్రజాశక్తి - కురుపాం

ఈ ఏడాది సంపూర్ణంగా వర్షాలు కురవక ఖరీఫ్ సీజన్ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల వర్షాలు కురుస్తాయని అనుకున్న రైతులకు అడియాశలే మిగిలాయి. చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి వాటివల్ల మండలంలో ఏ పంట పొలాలు కూడా సంపూర్ణంగా తడవలేదు. రోజూ మేఘాలు ఊరిస్తూ కనబడుతూ చిరు జల్లులు పడుతున్నాయి. పెద్ద వర్షాలు ఎప్పుడు కురుస్తాయోని ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

మండలంలో 23 పంచాయతీల్లో ఖరీఫ్ సీజన్‌లో 10,717 ఎకరాల్లో పంటలు సాగుకానున్నాయి. ఇప్పటివరకు అరకొర వర్షాలకు ఊటగడ్డలు దగ్గర ఉన్నటువంటి 135 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగింది. ఇంకా 10,582 ఎకరాల సాగు కావాల్సి ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పనుల్లేక అల్లాడుతున్న వ్యవసాయ కూలీలు

మండలంలో మంచి వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయ కూలీలు సైతం పనుల్లేక అల్లాడుతున్నారు. గతేడాది జూన్, జులై నెలలో మంచి వర్షాలు కురవడంతో వ్యవసాయ కూలీలకు మంచి డిమాండ్ ఉండేది. రూ.250 నుంచి రూ.300కు పైగా కూలి ఇచ్చేవారు. ఈ ఏడాది పనులు కల్పించి రూ.200 ఇచ్చే వారు కూడా కరువయ్యారు. ఇటీవల అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు అరకొర పని దొరికింది. కానీ సంపూర్ణంగా కూలి పనులు దొరకడం లేదని, ఉపాధి హామీ పనులకు వెళితే సకాలంలో కూలీలు అందక కష్టంగా మారిందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారాలు పెద్దగా జరగడం లేదు

వర్షాలు సరిగా కురవకపోవడంతో వ్యాపారాలు ఏమీ పెద్దగా జరగడం లేదని ఎరువులు, పురుగుల మందుల షాపుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేశామని చెబుతున్నారు. కొన్ని కంపెనీల మందులు అయితే క్రెడిట్ ఇచ్చారని, వారికి తిరిగి ఏ విధంగా పైకం చెల్లించాలో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాపు అద్దెలు, విద్యుత్తు బిల్లు కట్టడానికి కూడా వ్యాపారాలు జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.



వర్షాభావంతో పడని వరినాట్లు

మూడు రోజులుగా వదలని ముసురు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో మూడు రోజులుగా పట్టిన ముసురు వీడటం లేదు. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకురాలేని పరిస్థితి నెలకొంది. తోటపల్లి, కురుపాం, బత్తిలి ప్రాంతాల నుంచి కూరగాయలు, అరటిపళ్లు, చేపల అమ్మకానికి వస్తున్న వ్యాపారులు వర్షంలో తడిసి అమ్మకాలు సాగిస్తున్నారు. వర్షంతో దూరప్రాంతాల నుంచి గిరిజనులు రాకపోవడంతో గుమ్మలక్ష్మీపురంలో బుధవారం వారపుసంత బోసిపోయింది. ఆర్‌టిసి కాంప్లెక్స్, జిసిసి, ప్రధాన రహదారుల వద్ద నీరు నిలిచింది. ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-సాలూరు

బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబు కిడ్నాప్, హత్యకు నిరసనగా బుధవారం కోర్టు కార్యకలాపాలను న్యాయవాదులు బహిష్కరించారు. అనంతరం కోర్టు ఆవరణలో నిరసన తెలియజేశారు. సాలూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సబ్బాన వేణుగోపాలరావు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.

జీతాలు నిలుపుదల చేయడం అన్యాయం

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ డివిజన్ పరిధిలోని పది పిహెచ్‌సిల్లో పని చేస్తున్న సుమారు 300 మంది జీతాలు కావాలనే సబ్‌ట్రెజరీ అధికారులు నిలుపుదల చేశారని ఎపిడిఇఎ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి భరత్ భూషన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం వైద్య ఆరోగ్య శాఖ యూనియన్ సభ్యులతో కలిసి ట్రెజరీకి వెళ్లి అధికారులను నిలదీశారు. ప్రతి పనికీ లంచం డిమాండ్ చేస్తున్నారని, లంచం ఇవ్వనిదే ట్రెజరీలో పనులు జరగవని ఆయన ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఉద్యోగుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉపేక్షించేది లేదనీ సబ్ ట్రెజరీ కార్యాలయం ముందు ఉద్యోగులు నినాదాలు చేశారు.



సబ్ ట్రెజరీ కార్యాలయం ముందు నినాదాలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు



బురద రోడ్డుపై వరి నాట్లు వేస్తున్న టిడిపి నాయకులు

బురద రోడ్డుపై నాట్లు

టిడిపి ఆధ్వర్యాన వినూత్న నిరసన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయక్రిష్ణ ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బురదమయంగా ఉన్న రోడ్డుపై వినూత్నరీతిలో నాట్లు వేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా కనీసం రోడ్ల వైపు చూడటం లేదన్నారు. ఓని రోడ్డు చూస్తే దారుణంగా తయారైందన్నారు. ఓని గ్రామానికి మండల నిధుల నుంచి రెండు లక్షల రూపాయలు కేటాయించినా గ్రావెల్ ఉపయోగించకుండా మట్టి పోయడంతో రోడ్డు అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, మండల అధ్యక్షులు గండి రామినాయుడు, మాజీ సర్పంచ్ కోట సంఘంనాయుడు, మామిడి ధనుంజయ్ పాల్గొన్నారు.

గజరాజుల బీభత్సం



- సంగాంలో మూడు ఆవులపై దాడి
- ఒకటి మృతి, రెండింటికి తీవ్ర గాయాలు
- మగ్గూరులో అర్ధరాత్రి వీధిలోకి వచ్చిన ఏనుగు

ప్రజాశక్తి - వంగర

మండలంలోకి ప్రవేశించిన గజరాజులు గుంపు ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. వివిధ గ్రామాలలో సంచరించి చెరకు, వరి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడంతో పాటు పశువులపై దాడి చేసి బీభత్సం సృష్టించింది. శ్రీహరిపురంలో ప్రవేశించిన ఏనుగులు భాగం పేట చేరుకొని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి యొక్క తిండి గింజలను ధ్వంసం చేశాయి. అక్కడ నుంచి నీలయ్యవలస, జగన్నాథవలస, మడ్డువలస గ్రామ పొలాల్లో సంచరించి పంటలను ధ్వంసం చేశాయి. సంగాం చేరుకుని వరి, మొక్కజొన్న, జీడి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏనుగులు దాడిలో ఆవు మృతి

మండలంలోని సంగాం గ్రామానికి చెందిన బొడ్రోతు రామినాయుడు పాడి ఆవుపై మంగళవారం అర్ధరాత్రి ఏనుగులు గుంపుగా వచ్చి దాడి చేయడంతో ఆవు మృతి చెందింది, అదే గ్రామానికి చెందిన వావిలపల్లి జగన్నాథం నాయుడు, ఆలుబిల్లి ఈశ్వరరావులకు చెందిన ఆవులపై ఏనుగులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాయి. తమ పాడి ఆవు మృతి చెందిందని రామి నాయుడు కుటుంబం కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై తహశీల్దార్ డి ఐజాక్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏనుగులు దాడిలో మృతి చెందిన ఆవుకు వంగర ఇంచార్జి పశువైద్యాధికారి వేగిరెడ్డి రాము పోస్టుమార్టం నిర్వహించారు. నివేదికను ఫారెస్ట్ అధికారులకు పంపిస్తామని తెలిపారు.

మగ్గూరులో ఓ ఇంటి తలుపు తట్టిన ఏనుగు

సంగాంలో బీభత్సం సృష్టించిన ఏనుగులు గుంపు అక్కడ నుంచి దగ్గరలో ఉన్న మగ్గూరు గ్రామానికి అర్ధరాత్రి చేరుకున్నాయి. అందులో ఓ ఏనుగు గ్రామ శివారులో ఉన్న మారడాన శ్రీనుకు చెందిన ఇంటి తలుపును పెద్ద ఘీంకార శబ్దం చేసి తట్టడంతో భయభ్రాంతులకు గురై ఆ ఇంట్లో ఉన్న వారంతా బయటకు పరుగులు తీసి కేకలు వేశారు. ఇంటి పక్కనే తన శాలలో ఉన్న ఆవుపై ఏనుగు దాడి చేసిందని శ్రీను తెలిపారు. మగ్గూరులో బుధవారం సాయంత్రం వరకు సంచరించిన ఏనుగుల గుంపు అక్కడ నుంచి మండలంలోని ఓని అగ్రహారం పొలాల్లోకి చేరుకున్నాయి.

భయాందోళన చెందుతున్న ప్రజలు

పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు వీధుల్లోకి చొరబడి పశువులపై దాడి చేయడంతో పాటు తలుపులు తడుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రధానంగా ప్రస్తుతం వరి పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఇలాంటప్పుడు ఏనుగులు పొలాల్లో సంచరిస్తుండటంతో పొలాలకు వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు. రహదారుల పైన కూడా రాకపోకలకు ఆటంకం కల్పిస్తున్న ఏనుగులను ఇక్కడ నుంచి పంపించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్రమత్తం చేస్తున్న అధికారులు

ఏనుగుల వద్దకు ప్రజలు ఎవరూ కూడా వెళ్లకుండా తహశీల్దార్ డి.ఐజాక్, ఎస్ఐ ఆర్ జనార్ధన్‌రావు గ్రామాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులు కదిలికిన ఎలిఫెంట్ మానిటరింగ్ యూనిట్ అధికారి (ఈఎంసి) మణికంఠ, విజయనగరం ఫారెస్ట్ రేంజ్ అధికారి బి. అప్పలరాజు, బీట్ అధికారులు స్వప్న, రిషికేశ్, సత్యనారాయణ, మొత్తం 18 మంది ట్రాకర్స్, అటవీ శాఖ సిబ్బంది పరిశీలిస్తున్నారు. ఏనుగుల వైపు ప్రజలు ఎవరూ వెళ్లి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ప్రజలకు తెలియజేస్తున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

సంగాం, మగ్గూరు గ్రామాలలో ఏనుగులు సంచరించడంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా గ్రామాలకు విద్యుత్ శాఖ ఏఈ వినయ్ కుమార్ బుధవారం కొంత సమయం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల నుంచి ఏనుగులు కదలడంతో మరల విద్యుత్ పునరుద్ధరించారు.

పెరిగిన మలేరియా కేసులు

ప్రజాశక్తి-సీతంపేట

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మలేరియా కేసులు పెరిగాయని జోనల్ అధికారి కె.మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం సీతంపేట ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. మలేరియా కేసులు గురించి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావుతో మాట్లాడి, ఆరాతీశారు. మిగతా ఆసుపత్రులతో పోలిస్తే సీతంపేట ఏరియా ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు మెరుగ్గా అందిస్తున్నారని కితాబిచ్చారు. ఇటీవల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, అందుకే మలేరియా కేసులు దశల వారీగా పెరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే వైద్యులను అప్రమత్తం చేశామని చెప్పారు. ఇంకా అవసరమేమైనా ఉంటే సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు, సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, వైద్యులు మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ర్యాలీ ర్వహిస్తున్న టిడిపి శ్రేణులు

డంగులగూడలో భవిష్యత్తుకు భరోసా

ప్రజాశక్తి - కురుపాం

ప్రజల భవిష్యత్తుకు, మహిళలకు భరోసా కావాలంటే రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని గెలిపించుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు బి.పద్మావతి అన్నారు. మండలంలో నీలకంఠాపురం పంచాయతీ డంగులగూడ గ్రామంలో బుధవారం మహిళల భరోసాకు మహాశక్తి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ గ్రామస్తులకు మహాశక్తి పథకం గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జి.రమణమూర్తి, టిడిపి నాయకులు కొండలరావు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు కాపాడాలని వినతి

ప్రజాశక్తి -భామిని

మండలంలో లివిరి గోపినాథస్వామి దేవాలయ భూములను కాపాడాలని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తహశీల్దార్ అప్పారావుకు వినతి అందించారు. లివిరి, సోలికిరి, వడ్డంగి గ్రామాలలో భూమి అన్యాక్రాంతమైందని తెలిపారు. సమగ్ర భూ సర్వేలో భాగంగా రెవెన్యూ అధికారులు ఆలయ భూముల రికార్డులు పరిశీలించి, దేవాలయ భూములుకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌడు కైలాష్, గెల్లంకి రమేష్, బౌరి త్రినాథ్, మీగడ సంతోష్ పాల్గొన్నారు.



నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరుతున్న నిమ్మక

జనసేనలోకి మాజీ జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -భామిని

వైసిపిలో కీలకంగా ఉన్న జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నిమ్మక నిబ్రం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సూచనల మేరకు క్రియాశీలకంగా ఉంటూ, క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతనికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు పాలవలస యశస్వి, పి.చంద్రశేఖర్, భామిని మండల అధ్యక్షులు రుంకు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మిక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో కార్మిక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సిఐటియు నాయకులు గుమ్మడి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కార్మికులు ఏవైనా పనుల నిమిత్తం లేబర్ కార్యాలయాన్ని సంప్రదించాలని అనుకుంటే 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని గుమ్మలక్ష్మీపురం మండల కార్యాలయంలో లేబర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

సేవలకు సత్కారం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గుర్తించి దేవాంగుల సంఘం సభ్యులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బోడ పోలరావు, మండవల్లి సత్యనారాయణ, 12వ వార్డు కౌన్సిలర్ తాడి అరుణ, తాడి శంకరరావు, పతివాడ తౌడు, తదితరులు పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో పొలంబడి

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కె.వెంకటాపురంలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. సేంద్రియ ఎరువులతో రైతుకు అధిక లాభం వస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రైతులు, వివిఎ పాల్గొన్నారు.

4న ఐటిఐ మిగులు సీట్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-సాలూరు

ఈ నెల 4న ఐటిఐ మిగులు సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ వి.రవికుమార్ తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 4న అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 147వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు. వెంకంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.పరాంకుశంనాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పింగళి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

వీరఘట్టం : మండలంలోని బుధవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నడుకూరు, బొడ్లపాడు గ్రామాల్లో జనసేన నాయకులు ఎం.పుండరీకం, వజ్రగడ రవికుమార్.. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

4న మక్కువ మండల సమావేశం

ప్రజాశక్తి-మక్కువ

ఈ నెల నాలుగో తేదీన మక్కువ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఎంపిపి మర్రి పారమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ హాజరుకావాలని కోరారు.

టేక్ హోం రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-బలిజిపేట

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమం కింద గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ పంపిణీని చిలకలపల్లిలో బుదవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, వైసిపి మండల అధ్యక్షులు పి.మురళీకృష్ణ, సర్పంచ్ ఎ.సుందరరావు, ఎంపిటిసి ఎ.మల్లిక, వైసిపి సీనియర్ నాయకులు తప్పిట ప్రసాద్, పోల రామకృష్ణ, పి.నారాయణరావు, జి.శంకరరావు, ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్ సుగుణ, సూపర్‌వైజర్ సంబాన సులేఖ పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బుధవారం జెడ్‌పిటిసి ఎం.బాబ్జి గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. 25 రోజులకు సంబంధించి రేషన్ పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.తెరీజమ్మ, ఎంపిటిసిలు గౌరి, బి.కుసుమ సూర్యనారాయణ, అంగన్వాడీ సూపర్వైజర్ వి.పూర్ణిమ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : గర్భిణులు, బాలింతలకు ఇంటింటికి రేషన్ పంపిణీ చేయనున్నట్లు ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, పి.అరుణకుమారి తెలిపారు. రావుపల్లి, రావివలస, గరుగుబిల్లి, ఉల్లిభద్ర తదితర గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం గర్భిణులు, బాలింతలకు రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు మర్రాపు సావిత్రి, పి.కృష్ణవేణి, ఆర్.పద్మ, ఎం.స్వాతి, పి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట.. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతంపేట : మండలంలో అంగన్వాడీ కేంద్రంలో ఎంపిపి బి.ఆదినారాయణ టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిడిపిఒ పి.రంగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పార్వతి, ఉష, యశోద పాల్గొన్నారు.

సాలూరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ చెప్పారు. బుధవారం పట్టణంలోని 8 వార్డు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ పోషణ కిట్లను వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఒ సత్యవతి, ఎసిడిపిఒ మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : శివరాంపురంలో సర్పంచ్ జరజాపు మోహన్ ఆధ్వర్యంలో టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ప్రజాశక్తి-వీరఘట్టం

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఎమ్మెల్యే వి.కళావతి సూచించారు. బుధవారం మండలంలోని వండవ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.కళ్యాణి, సూపర్వైజరు రాజేశ్వరి పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సబ్‌సెంటర్ ఎంఎల్‌హెచ్ కమలజ్యోతి అన్నారు. బుక్కూరు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పోషకవిలువలు అందాలంటే తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు దివ్య, ఎన్.హిమప్రభ, ఎఎన్ఎం రాజేశ్వరి, ఇందిరా తదితరులున్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ పోషణ కిట్లు అందించారు.

మక్కువ : మొదటి ఆరు నెలలు క్రమం తప్పక తల్లిపాలు అందిస్తే ఆ బిడ్డలు ఎదుగుదలకు ఎంతో మేలు చేకూరుస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజశ్రీ అన్నారు. బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మక్కువ అంగన్వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజరు లీలావతి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ

ఎమ్మెల్యే కళావతి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని దారబ పంచాయతీ పరిధిలో పి.హెచ్ రోడ్డు నుండి దిగువ దారబ వయా కర్రగూడ సిసి రోడ్డు వరకు రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే విశ్వసరాయి.కళావతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రోడ్డు నిర్మాణం చేపట్టక అవస్థలు పడుతున్న దారబ పంచాయతీ పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. రూ.37 లక్షలతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, సవర రాము, పాలకొండ వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ హిమరక మోహన్ రావు, సర్పంచ్ సవర. సిమ్మయ్య, ఎంపిటిసి నిమ్మక హరిప్రసాద్, నాయకులు సవర సాయికుమార్, సవర చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

కిల్లారి కుటుంబానికి పరామర్శ

పాలకొండ : పట్టణంలో కిల్లారి సుగుణాకరరావునాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే కళావతి పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహన్, కడగల రమణ, కోడెం విజయ్‌కుమార్ ఉన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరినీ ఓటరుగా చేర్చాలి

ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి-సాలూరు రూరల్



ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

అర్హులైన ప్రతిఒక్కరినీ ఓటరుగా చేర్పించే బాధ్యతను బిఎల్ఒలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ ఆదేశించారు. బుధవారం మండలంలోని తోనాం పంచాయతీ పరిధిలో గడపగడపకు వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ఇంటి నంబర్‌పై పది మందికి మించి ఓటర్లు ఉంటే, 11వ నంబర్ నుండి వేరే ఇంటి నంబర్ ఇచ్చి వారిని ఓటరుగా చేర్చాలని సూచించారు. జీరో ఇంటి నంబర్లు రాకుండా చూడాలన్నారు. గ్రామం నుంచి ఎవరైనా బయట ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోతే వారి సమాచారం సేకరించి, ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాలమురళీకృష్ణ సర్పంచ్ మువ్వల ఆదయ్య, పంచాయతీ కార్యదర్శి అలీషా పాల్గొన్నారు.

రోడ్డు ఇలా ఉంటే ప్రయాణం ఎలా?

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పరజపాడు నుండి కుదమ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా పాడై గోతులు ఏర్పడడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం సాయంత్రం పరసపాడు రోడ్డును పరిశీలించారు. రహదారి పూర్తిగా గోతులు ఏర్పడినా ప్రభుత్వం, అధికారులు కనీసం స్పందించడం లేదన్నారు. 108, ద్విచక్ర వాహనాలు రావడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మర్రాపు పురుషోత్తంనాయుడు, నందివాడ కృష్ణబాబు, డొంకాడ రామకృష్ణ, నాయకులు తాతబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అధ్వానంగా తయారైన రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి

ప్రకృతి సాగుతో రైతులకు మేలు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ భవన ప్రాంగణంలో బుధవారం జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో 235 పంచాయతీల్లో 306 గ్రామ సంఘాల ద్వారా 70,130 మంది రైతులతో 1,32,589 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వర్షాలు అనుకూలంగా ఉన్నందున ప్రతి కార్యకర్త రైతులకు అందుబాటులో ఉండి తగు సూచనలు సలహాలు అందివ్వాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయమే మన జీవన విధానంగా మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.పారినాయుడు, ఎఒ విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి-బలిజిపేట

రానున్న సార్వత్రిక ఎన్నికలలో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయచంద్ర అన్నారు. మండలంలోని పెదపెంకి గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో ముందుగా గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అవినీతి, అరాచక పాలన గురించి ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెంకి రామ్మోహనరావు, ఎస్.శేషగిరిరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు జి.బాబ్జి, ఎస్.రాంబాబు, అప్పలనాయుడు, శ్రీను, అప్పారావు, జి.సింహాచలం నాయుడు, కె.సింహాచలం నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

4న చినమేరంగిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మాజీమంత్రి శత్రుచర్ల విజయరామరాజు జన్మదినం సందర్భంగా ఈ నెల 4న జియ్యమ్మవలస మండలం చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. ఈ శిబిరానికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మిడి సంధ్యారాణి, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన హాజరవుతున్నట్లు తెలిపారు. నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి నుంచి వైద్యులు వచ్చి రోగులకు సేవలు అందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద బుధవారం 15.340 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన అలోక్‌శెట్టి సంచిలో గంజాయి పట్టుకుని నడుచుకుంటూ వస్తున్నాడు. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద ఆయన్ను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫకృద్దీన్ తెలిపారు.

కాలువలపై ఆక్రమణలు తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

గత నెల 31న ప్రజాశక్తిలో ప్రచురితమైన 'అక్రమ నిర్మాణాలు.. కనబడని కాలువలు' అనే కథనానికి మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, వార్డ్ ప్లానింగ్ సెక్రటరీలు బుధవారం కాలువలపై అక్రమ నిర్మాణాలను తొలగించారు. నిర్మాణ దశలోనే పర్యవేక్షణ చేస్తే ఈ ఆక్రమణలు జరగకుండా ఉంటాయని పలువురు అంటున్నారు.



కాలువలపై ఆక్రమణలను తొలగిస్తున్న కార్మికులు